క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



పుస్తకాల గదికి తాళాలు వేస్తున్న ఎంఈఓ

టెక్కలి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టెక్కలి ఎంఈఓ డి.తులసీరెడ్డి హెచ్చరించారు. టెక్కలి పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను విక్రయిస్తున్నారని అఖిల భారత విద్యార్థి పరిషత్ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో పుస్తకాల గదికి తాళాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయించడం, ఫీజులు వసూళ్లు చేయడం చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కె.మురళి, మదన్, విశ్వనాథ్, శ్యామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ యూనివర్శిటీతో ఆదిత్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో కళాశాలల ప్రతినిధులు

టెక్కలి: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్శిటీతో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గురువారం కళాశాలలో ఎస్ఆర్ యూనివర్శిటీ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎం.బాలాజీ, ఆదిత్య కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అకడమిక్ పరిశోధన, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని డైరెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్‌లు సీహెచ్.రమేష్, డి.విజయకుమార్, బి.వి.రమణ, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగి మృతి



సుధీర్‌కుమార్‌దాస్ (ఫైల్)

ఇచ్ఛాపురం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుధీర్ కుమార్ దాస్(41) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన 11వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ పట్టణ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్‌దాస్ కుమారుడు. అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తూ అందరితో స్నేహంగా మెలిగేవారు. సుధీర్‌కుమార్‌కు భార్య రంజిత, మూడేళ్ల కుమార్తె శాన్వి ఉన్నారు. ఈయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసారు.

టెక్కలిలో టీడీపీ కార్యకర్తల సంబరాలు



టెక్కలి బైరివీధిలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తల

టెక్కలి: టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడికి మంత్రి పదవి దక్కడంతో గురువారం పట్టణంలో టీడీపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. పట్టణ అధ్యక్షుడు కోళ్ల లవకుమార్ ఆధ్వర్యంలో బైరివీధిలో కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అంబేడ్కర్ జంక్షన్‌లో అభయం ఫుడ్‌బ్యాంక్ వద్ద పలువురు నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎన్ రమణ, ఎల్.దుర్గారావు, ఎస్.కిరణ్, ప్రఫుల్లా, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అసిరిపోలమ్మ చల్లదనం



బొరివంకలో అసిరిపోలమ్మ అమ్మవారి చల్లదనోత్సవం

కవిటి: మండలంలోని బొరివంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి చల్లదన ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా జేష్ట మాసంలో పనసపండ్లు, మామిడి పండ్లు, పానకం, పాయసం వంటి నైవేద్యాలతో అమ్మవారికి చల్లదనం చేయడం సంప్రదాయంగా వస్తోంది. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను మేళతాళాలతో కాళీకాదేవి వేషధారుల నృత్యాలతో బాణసంచా కాల్చుతూ తిరువీధి నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంట దిగుబడులు బాగా రావాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు.

బడి బాటలో బాలలు





కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులంతా బడి బాట పట్టారు. పాఠశాలల్లో చేరికలు ఆరంభమయ్యాయి. టెక్కలి మండలంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులంతా యధావిధిగా పాఠశాలలకు చేరుకున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వేసవి సెలవులు ముగియడంతో వజ్రపుకొత్తూరు మండలంలో పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అయ్యాయి. చిన్నారులు నూతన ఉత్సాహంతో బడి బాట పట్టారు.

ఇచ్ఛాపురం రూరల్: వేసవి సెలవులు ముగిశాయి. గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోవడంతో ఇచ్ఛాపురం మండలంలో బడులు విద్యార్థులతో కళకళలాడాయి. పాఠశాలలు ప్రారంభం రోజునే ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందజేసినట్లు ఎంఈఓ కురమాన అప్పారావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల వినూత్న ప్రచారం..

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్నంగా ప్రచారం చేపట్టారు. ప్రైవేటు స్కూళ్లలో కాకుండా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న తమ బడిలోనే చిన్నారులను చేర్పించాలంటూ ప్రధానోపాధ్యాయుడు దాట్ల దాశరథి ఆధ్వర్యంలో పలాస ఉన్నత పాఠశాల నుంచి మొగలిపాడు గ్రామం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పాఠశాల పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో మెరుగైన పనితీరును పదో తరగతి ఫలితాల్లో కనబర్చిందని వివరించారు. తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించి తమ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కోరారు.

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్‌లో పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులను వినూత్నంగా ఆహ్వానించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ బడిలోకి ఆహ్వానిస్తూ ఏడాదంతా చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు.



టెక్కలి: వంశధార కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



కాశీబుగ్గ: సత్యసాయి విద్యావిహార్‌లో చిన్నారులకు హారతులిస్తున్న ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం రూరల్: యూనిఫాంతో పూర్ణాటకం విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: బడికి వస్తున్న ధర్మపురం విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగలో చిన్నారిని బడికి తీసుకువస్తున్న దృశ్యం

పలాస ఎమ్మెల్యేను కలిసిన విద్యుత్ ఉద్యోగులు



ఎమ్మెల్యే శిరీషను సత్కరిస్తున్న పలాస డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది



ఎమ్మెల్యే శిరీషకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాశీబుగ్గ సీఐ విజయానంద్

కాశీబుగ్గ: పలాస విద్యుత్ కార్యాలయం (ఈఆర్ఓ) పరిధిలోని పలాస డివిజన్ విద్యుత్ ఉద్యోగులు గురువారం ఎమ్మెల్యే గౌతు శిరీషాను కలిశారు. నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి పలాస విచ్చేసిన సందర్భంగా ఆమె స్వగృహంలో కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.గిరీశ్వరరావు, కార్యదర్శి గారరాజారావు, కార్యవర్గ సభ్యులు ఎం.హిమగిరి, కింతల శంకర్, భాస్కరరావు, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కాశీబుగ్గ సీఐ విజయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో శాంతిభద్రతలపై చర్చించారు. దొంగతనాలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం పలాసలో ఆర్డీఓ భరత్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాలతో సంపద సృష్టించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

సోంపేట: ఘన వ్యర్థాలతో సంపద సృష్టించాలని సోంపేట సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఘనవ్యర్థాల నిర్వహణపై గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇళ్లను ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఘనవ్యర్థాలు సేకరించడం, శుద్ధి చేయడం, సంపద సృష్టించే విధానంపై గ్రామస్థాయి అధికారులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం సోంపేటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామారావు, ఈవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, మండల పరిషత్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అభినందనీయం



కవిటి పాఠశాల విద్యార్థులకు షీల్డ్‌లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కవిటి: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న బాలబాలికల్ని చదువులో మరింత ప్రోత్సహించేందుకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు అందిస్తున్న ప్రోత్సాహకాలు అభినందనీయమని హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు, ఎంఈఓ ధనంజయ మజ్జి అన్నారు. గురువారం కవిటి ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నెయ్యిల చరణ్(రూ.5000), తామాడ అతుల్ భరద్వాజ్(రూ.3000), పిరియా సాత్విక(రూ.2000)కు నగదు ప్రోత్సాహకాలతో పాటు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాల్ని అదే పాఠశాలకు చెందిన 1979-80 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిరియా పద్మనాభం, తోట రామారావు, కీలు చంద్రశేఖరం, జేవీ రమణ, బొర్ర గోపి, డి.వీరాస్వామి, డి.జోగులయ్య పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

శ్రీకాకుళం అర్బన్: మూడేళ్లు దాటిన ప్రీ స్కూల్ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ కృష్ణాపార్క్ సెక్టారు పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి కోరారు. నగరంలోని దూదివారి సందు, తుమ్మవీధి, మహిళామండలి వీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు చేర్పడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టారు పరిధిలో ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి ప్రీస్కూల్ పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, సునీత, నాగమణి, సుజాత పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఆటపాటలతో కూడిన విద్యనందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. మంగువారితోట, కమలా నివాస్ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కళ్యాణి, ఇందు, హెల్పర్లు హెచ్.విజయ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈసెట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థికి ద్వితీయ ర్యాంకు

టెక్కలి: ఇటీవల విడుదలైన ఏపీ ఈసెట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఈసీఈ డిప్లమో పూర్తి చేసిన బోయిన యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటబొమ్మాళికి చెందిన యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లమో డీడీ బి.ఎస్.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

నేడు రక్తదాన శిబిరం

వజ్రపుకొత్తూరు రూరల్: రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కాశీబుగ్గలో చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 'ఆ నలుగురు' ట్రస్ట్ కమిటీ ప్రతినిధి ఈశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. విద్యా వాహిని కళాశాల నుంచి బస్టాండ్ వరకు రక్తదానంపై అవగాహన ర్యాలీ, కొత్తగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా హాజరు కావాలని కోరారు.

దేవదాయ కార్యనిర్వాహక అధికారిగా వాసుదేవరావు



వాసుదేవరావు

కాశీబుగ్గ: పలాస, మందస గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారిగా పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి దేవస్థానం గ్రేడ్-1 కార్యనిర్వహణ అధికారి టి.వాసుదేవరావును అదనపు చార్జ్‌లో నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం మందస గ్రూప్ దేవాలయాల నుంచి ప్రకటన విడుదలైంది.

మందసలో తాగునీటి ఎద్దడి



నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

కాశీబుగ్గ: మేజర్ పంచాయతీ మందసలో తాగునీటి సమస్య నెలకొంది. పంచాయతీ పరిధిలోని మందస, చిన్నబరంపురం, మేఘమాల గ్రామాల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

శ్రీకాకుళం రూరల్: డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించి రైతులకు బిల్లులు విధిగా అందించాలని మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి సూచించారు. గురువారం మండల పరిధిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా మెయింటెయిన్ చేయాలని, నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొలకెత్తే ధాన్యం గింజలను ప్యాకింగ్ చేసి రైతులకు అందివ్వాలని కోరారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్ల సరఫరా



కవిటి: హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాలు, కిట్లు అందిస్తున్న ఎంఈఓ ధనంజయ మజ్జి



పలాస: ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్ల పంపిణీ మండలంలో గురువారం ప్రారంభించారు. స్టాక్ పాయింట్ వద్ద ఎంఈఓ ధనంజయ మజ్జి ఆయా పాఠశాలల సిబ్బందికి ఇండెంట్ ప్రకారం పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లను సరఫరా చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస: ప్రభుత్వ పాఠశాలలకు గురువారం ఎంఈఓ కార్యాలయం వద్ద పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లు అందజేశారు. పలాస మండలానికి మొత్తం 50,400 వివిధ రకాలు పాఠ్యపుస్తకాలు, కిట్లు వచ్చాయని ఎంఈఓ శ్రీనివాసరావు చెప్పారు.

ఇచ్ఛాపురం: మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 30 పాఠశాలలకు స్టూడెంట్స్ కిట్లను సరఫరా చేసినట్లు ఎంఈఓ కె.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు ఆధ్వర్యంలో మండల స్టాక్ పాయింట్ వద్ద స్టూడెంట్ కిట్లు అందజేశారు.



ఇచ్ఛాపురం: కిట్ల సరఫరాను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కె.అప్పారావు

వజ్రపుకొత్తూరు రూరల్: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలకు స్టూడెంట్ కిట్లను ఎంఈఓలు దాశరథి, బి.వెంకట రమణమూర్తి పంపిణీ చేశారు. మండలంలో 64 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు అక్కుపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న సుమారు 6500 విద్యార్థుల కోసం కిట్లు ఇటీవల మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయని వివరించారు. కార్యక్రమంలో నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: ప్రధానోపాధ్యాయులకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న విద్యాశాఖాధికారులు, సిబ్బంది

19న హిందూ మత సమ్మేళనం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అలేఖ్ సాధువులు

సోంపేట: అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ, ఈక్వాలిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరబాద్‌లో జరగనున్న హిందూమత సమ్మేళనం విజయవంతం చేయాలని అలేఖ్ సాధువులు విజయానంద, దేవేంద్ర స్వాములు కోరారు. ఈ మేరకు బాతుపురంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ అధికార ప్రతినిధి ఖదిజ్ఞాసి యోది మల్లికా వల్లభ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యోద సత్యనారాయణ, ఉత్తరాల ప్రసాద్‌కుమార్, కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒడియా భాషోపాధ్యాయుడి మృతి



బంగారు గణేష్(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మండపల్లి ఉన్నత పాఠశాలలో ఒడియా భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బంగారు గణేష్(56) గురువారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రధానోపాధ్యాయుడు జాడు ప్రకాశరావు తెలిపారు. కంచిలి మండలం డోలగోవిందపురం గ్రామానికి చెందిన గణేష్ ఏడేళ్లగా మండపల్లి ఉన్నత పాఠశాలలో ఒడియా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భవానీపురం కాలనీలో నివాసముంటున్న ఈయన గురువారం ఉదయం వరకు లేవకపోవడంతో కుటుంబ సభ్యులు నిద్ర లేపడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈయన మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలియజేశారు. గణేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీడిరైతుల ఎదురుచూపులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న జీడి పిక్కలు

పలాస: ఉద్దానం ప్రాంతంలోని జీడి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన జీడి పిక్కలను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. పలాస మార్కెట్‌లో జీడి పిక్కల బస్తా ధర రూ.11వేలు ఉండగా.. జీడి రైతుల పోరాట సంఘాలు మాత్రం 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులను కట్టడి చేస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు గ్రామాల్లోకి వచ్చి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. రైతులు మాత్రం తాము ఎప్పుడు పిక్కలు అమ్ముకొని తమ అవసరాలు తీర్చుకుంటామా అని ఎదురు చూస్తున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్:

వివిధ రకాల రుణాలు తీసుకున్న స్వయంశక్తి సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు కోరారు. గురువారం ఇచ్ఛాపురం మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాల నుంచి సామాజిక పెట్టుబడి, బ్యాంకుల ద్వారా తీసుకున్న బ్యాంకు లింకేజీ, శ్రీనిధి వంటి రుణాలను ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాలన్నారు. రుణాలు, చెల్లింపులకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని సూచించారు.

బడులను బలోపేతం చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్కారు బడులను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీఓ 117ను రద్దు చేయాలని కోరారు.